# ఇది ప్రజాకంటక పాలన

- హామీల గురించి అడిగితే నిర్బంధమా?
- శాంతియుతంగా నిరసన తెలిపితే అరెస్టా?
- ఉద్యోగార్థుల డిమాండ్లను పరిష్కరించాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- నిరుద్యోగుల అక్రమ అరెస్టులపై ఖండన



హైదరాబాద్, జూలై 5(నమస్తే తెలంగాణ): 'ఇది ప్రజాపాలన కాదు.. ముమ్మాటికీ ప్రజాకంటక పాలన. ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరితే ఇంత నిర్బంధమా? ప్రభుత్వాన్ని ప్రశ్నించిన పాపానికి నిరుద్యోగులను అక్రమంగా అరెస్ట్ చేస్తరా? తెల్లదొరల పాలనకన్నా దుర్మార్గంగా కాంగ్రెస్ సర్కారు వ్యవహరిస్తున్నది. ప్రచారంలో ఓ మాట, అధికారంలోకి వచ్చాక మరోమాట మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి రెండు నాల్కల వైఖరి యువతకు అర్థమైంది' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని డిమాండ్ చేస్తూ నిరసన తెలిపిన ఉద్యోగార్థులపై ప్రభుత్వం వ్యవహరించిన తీరును, నిరుద్యోగుల అక్రమ అరెస్టులను ఆయన తీవ్రంగా ఖండించారు. ఉద్యోగాల భర్తీ, గ్రూప్స్ నోటిఫికేషన్ల సమస్యల పరిష్కారం, జాబ్ క్యాలెండర్ వంటి అంశాలపై టీజీపీఎస్సీ వద్ద శాంతియుతంగా నిరసన తెలిపిన నిరుద్యోగ, విద్యార్థి నాయకులను అరెస్టు చేయడం దుర్మార్గమని, యువతను కాంగ్రెస్ నమ్మించి మోసం చేసిందని, ఇది నయవంచక సర్కారు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్‌కు యువతపై ప్రేమ లేదని, నిరుద్యోగులంటే అసలే గౌరవం లేదని విమర్శించారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న ఉద్యోగార్థులు, విద్యార్థి సంఘాల నేతలను అరెస్ట్ చేయడం ఈ ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శమని చెప్పారు. అక్రమంగా అరెస్టు చేసిన వారందరినీ బేషరతుగా వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఇదే నిరుద్యోగులతో స్వయంగా రాహుల్‌గాంధీతో కాంగ్రెస్ మిలాఖత్‌లు ఏర్పాటు చేయించి అధికారంలోకి రాగానే వారిని అణచివేస్తున్నదని విమర్శించారు. ఎన్నికల ముందు భావోద్వేగాలు రెచ్చగొట్టి నిరుద్యోగులను వాడుకొని ఇప్పుడు వదిలేసిందని, న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరితే నోరు మెదపడం లేదని దుయ్యబట్టారు. ప్రజాపాలన పేరును పదేపదే వల్లె వేసే కాంగ్రెస్ సర్కారు యువకులు, విద్యార్థులకు కనీసం నిరసన తెలిపే అవకాశం కూడా ఇవ్వకుండా నియంతృత్వంతో వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. ఉద్యోగ నియామకాలు, జాబ్ క్యాలెండర్ విడుదలలో అట్టర్‌ఫ్లాప్ అయిన కాంగ్రెస్ ప్రభుత్వం, నిరుద్యోగులకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులను మోసం చేసిన కాంగ్రెస్ సర్కారును భూస్థాపితం చేయడం ఖాయమని ఆగ్రహం వ్యక్తంచేశారు. నిరుద్యోగులకు బీఆర్ఎస్ పార్టీ అన్నివిధాలా అండగా ఉంటుందని భరోసానిచ్చారు.

# నిరసన తెలిపే హక్కు లేదా?

**నిరుద్యోగుల గొంతులు, హక్కులను అణగదొక్కుతున్న కాంగ్రెస్ సర్కారు**

**ఇది ముమ్మాటికీ అప్రజాస్వామ్యపాలన: మాజీమంత్రి హరీశ్‌రావు మండిపాటు**



హైదరాబాద్, జూలై 5(నమస్తే తెలంగాణ):'హామీలిచ్చి, మాట తప్పిన కాంగ్రెస్ ప్రభుత్వ తీరుకు నిరసనగా, డిమాండ్ల సాధనే లక్ష్యంగా టీజీపీఎస్సీ వద్ద శాంతియుత నిరసన తెలిపేందుకు వెళ్తున్న విద్యార్థులు, నిరుద్యోగులు, విద్యార్థి సంఘాల నాయకులను ఎక్కడికక్కడ అరెస్టు చేసి నిర్బంధించడం హేయమైన చర్య, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం' అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే టీ హరీశ్‌రావు చెప్పారు. సోకాల్డ్ ప్రజాపాలనలో శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు కూడా నిరుద్యోగులకు లేదా? అని ప్రశ్నించారు. ఓవైపు ప్రజాపాలన అని ప్రచారం చేసుకుంటూనే కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగుల గొంతులు, హక్కులను అణగదొక్కే కుట్రలకు పాల్పడుతున్నదని మండిపడ్డారు. 'ఇది ప్రజాపాలన కాదు..ముమ్మాటికీ అప్రజాస్వామ్యపాలన' అని హరీశ్ ఫైర్ అయ్యారు. ఉద్యోగాల కోసం పుస్తకాలు పట్టుకొని చదవాల్సిన విద్యార్థులను నడిరోడ్డుకు ఈడ్చి ధర్నాలు, ఆందోళనలు చేసే దుస్థితికి ఈ ప్రభుత్వం తెచ్చిందని విమర్శించారు. ఎన్నికల ముందు హామీలిచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖం తిప్పుకొంటే విద్యార్థులు, నిరుద్యోగులకు తోడుగా ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదని స్పష్టంచేశారు. వారి డిమాండ్లు నెరవేర్చేదాకా వదిలిపెట్టేది లేదని, విద్యార్థులు, నిరుద్యోగుల తరఫున గొంతెత్తుతామని, నిర్విరామ పోరాటం చేస్తామని ప్రకటించారు.

## లోకం పోకడ




ఖాళీలు ఖర్తీ చేయమంటే
జైళ్లోవున్న ఖాళీలు భర్తీ చేస్తారట!

## తొలిసారి 'బాహుబలి' బారికేడ్లు

హైదరాబాద్, జూలై 5 (నమస్తే తెలంగాణ): నిరుద్యోగ మార్చ్ పేరిట తెలంగాణ నిరుద్యోగ జేఏసీ పిలుపు మేరకు శుక్రవారం టీజీపీఎస్సీని ముట్టడిని అడ్డుకోవడానికి రాష్ట్రంలో తొలిసారిగా బాహుబలి బారికేడ్లను ప్రయోగించారు. టీజీపీఎస్సీ కార్యాలయం గేటు ఎదురుగా రోడ్డుపై వాటిని మోహరించారు. ఆ బారికేడ్ల లోపలి భాగంలో పోలీసులు నిల్చునే విధంగా ఒక మెట్టు కూడా ఏర్పాటుచేశారు. ఆ బారికేడ్లు చుట్టూ పోలీసులు పహారా కాశారు. టీజీపీఎస్సీ కార్యాలయంలోకి ఏ ఒక్క వ్యక్తి కూడా దూరిపోకుండా గట్టి బందోబస్తు ఏర్పాటుచేశారు. కాగా, టీజీపీఎస్సీ సమీపంలో ఉన్న శ్రీ కాశీనాథుని ఆల యం లోపలికి పోలీసులు బూటుకాళ్లతోనే వెళ్లి అక్కడ ఉన్న యువకులను అరెస్టు చేశారు. దీంతో ఆలయం ప్రతిష్ఠకు పోలీసులు భంగం కలిగించారు. వెతికి మరీ పట్టుకొని అరెస్టు చేసి, పోలీస్‌స్టేషన్లకు తరలించారు. దీనిపై ఆధ్యాత్మిక వాదులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు.

## నిరుద్యోగులను బలి తీసుకుంటున్న కాంగ్రెస్

1969 తొలి దశ ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో 369 మంది విద్యార్థుల మరణానికి, మలిదశ ఉద్యమంలో 1,200 మంది మరణానికి కాంగ్రెస్ పార్టీని ప్రధాన కారణం. మళ్లీ ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇంకెంత మంది తెలంగాణ నిరుద్యోగుల ప్రాణాలు బలి తీసుకుంటుంది?

– గెల్లు శ్రీనివాస్‌యాదవ్, తుంగబాలు, బీఆర్ఎస్వీ నేతలు

## పెరుగుతున్న రేవంత్ అన్యాయాల చిట్టా

**ఉద్యోగాలు** ఇవ్వాలని పోరాడుతున్న నిరుద్యోగులను ఎక్కడికక్కడ నిర్బంధించడం, అరెస్ట్ చేయడం ఈ ప్రభుత్వ దమనకాండకు నిదర్శనం. శిశుపాలుడి పాపాల చిట్టాలా రేవంత్‌రెడ్డి సర్కార్ అన్యాయాల చిట్టా పెరిపోతున్నది. లాఠీచార్జీలు, అరెస్టులు, అడుగడుగునా నిర్బంధాలే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ ప్రజాపాలనా?

– డాక్టర్ ఆంజనేయగౌడ్, స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్

## ఇది నిర్బంధ పాలన

**ఇది** ప్రజాపాలన కాదు, నిర్బంధ పాలన. ఎన్నికలకు ముందు అమలుకు సాధ్యంకాని హామీలిచ్చి నిరుద్యోగులను మోసం చేసిన కాంగ్రెస్.. ఇప్పుడు అధికారంలోకి వచ్చాక వారిని రోడ్డుకీడ్చింది. పోలీసులు రాత్రి నుంచే అమ్మాయిలని కూడా చూడకుండా అరెస్టు చేయడం దారుణం.

– ఎర్రోళ్ల శ్రీనివాస్, బీఆర్ఎస్ అధికార ప్రతినిధి

## పోరుబాట వీడం

**నిరుద్యోగుల** డిమాండ్లను పరిష్కరించే దాకా పోరుబాట వీడం. నిరుద్యోగులను రెచ్చగొట్టి, వారి ఓట్లతో గద్దెనెక్కిన సీఎం రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చాక వారిని నిండా ముంచారు. ఇప్పటికైనా నిరుద్యోగులతో చర్చలు జరిపి హామీలను అమలు చేయాలి.

– రాజారాం యాదవ్, నిరుద్యోగ సమాఖ్య గౌరవాధ్యక్షుడు

## దారులన్నీ మూసివేత..

హైదరాబాద్, జూలై 5 (నమస్తే తెలంగాణ): టీజీపీఎస్సీ వద్ద నిరసన తెలుపడానికి వచ్చే నిరుద్యోగులను అడ్డుకోవడానికి పోలీసులు అన్ని ప్రయత్నాలు చేశారు. టీజీపీఎస్సీ కార్యాలయానికి చేరుకోవడానికి వెళ్లే నాంపల్లి, అబిడ్స్, మొజంజాహీమార్కెట్, ఎగ్జిబిషన్ గ్రౌండ్ వంటి దారులన్నీ బారికేడ్లతో మూసివేశారు.

## అరెస్టయిన చోటునుంచే నిరాహార దీక్ష

నిరుద్యోగ జేఏసీ నేత జనార్దన్

హైదరాబాద్, జూలై 5 (నమస్తే తెలంగాణ): అరెస్టయిన చోటు నుంచే నిరాహార దీక్ష చేద్దామని నిరుద్యోగ జేఏసీ నాయకుడు జనార్దన్ పిలుపునిచ్చారు. టీజీపీఎస్సీ ముట్టడి సందర్భంగా అనేక మంది అరెస్టయ్యారని తెలిపారు. ఎక్కడ అరెస్టయ్యామో అక్కడి నుంచే పోరుబాటకు సిద్ధం కావాలని కోరారు. తనను తరలించిన గోషామహల్ పోలీస్‌స్టేషన్‌లోనే నిరాహార దీక్ష చేస్తున్నానని చెప్పారు.

# చావో రేవో తేల్చుకుంటాం

- హామీలను మంటగలిపిన రేవంత్ సర్కార్
- ప్రభుత్వాన్ని గద్దెదించేదాకా విశ్రమించబోం
- కాంగ్రెస్ సర్కారుపై నిరుద్యోగుల కన్నెర్ర
- గోషామహల్ స్టేడియం వద్ద నిరసన
- గెల్లు, రాజారామ్‌యాదవ్ నేతృత్వంలో టీజీపీఎస్సీ ముట్టడి



టీజీపీఎస్సీ ఆఫీస్ ముట్టడిలో పాల్గొని నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్వీ నేతలు. బీఆర్ఎస్వీ నాయకులు గెల్లు శ్రీనివాస్‌యాదవ్, తుంగబాలు తదితరులను అరెస్టు చేస్తున్న పోలీసులు

హైదరాబాద్, జూలై 5 (నమస్తే తెలంగాణ): ఉద్యోగాల కోసం కాంగ్రెస్ సర్కారుపై చావో, రేవో తేల్చుకుంటాం.. ఆ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేసేదాకా పోరాడుతాం.. అమలు చేయకుంటే ఆ ప్రభుత్వం గద్దె దిగేదాకా పోరుబాట వీడబోము.. అని నిరుద్యోగులు ప్రతినబూనారు. శుక్రవారం తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) కార్యాలయాన్ని ముట్టడించిన బీఆర్ఎస్వీ నేతలు, నిరుద్యోగులను పోలీసులు అరెస్టు చేసి, బలవంతంగా వ్యాన్లలో గోషామహల్ స్టేడియానికి తరలించారు. ఈ సందర్భంగా వారంతా ముక్తకంఠంతో నినదించారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా అలుపెరుగని పోరాటాలకు దిగుతామని నిరుద్యోగులు శపథం చేశారు. హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్నదని ధ్వజమెత్తారు. అంతకు ముందు నిరుద్యోగుల తరఫున టీజీపీఎస్సీని బీఆర్ఎస్ నాయకులు గెల్లు శ్రీనివాస్, రాజారామ్‌యాదవ్‌తోపాటు పలువురు కార్యకర్తలు ముట్టడించారు. ఈ క్రమంలో పోలీసుల భారీ బందోబస్తును, బారికేడ్లు, ముండ్లకంచెలను ఛేదించుకుంటూ టీజీపీఎస్సీని ముట్టడించారు. ఈ క్రమంలో పెద్ద ఎత్తున నినదించారు. పోలీసులు వారిని అరెస్టు చేసి గోషామహల్ స్టేడియానికి తరలించారు.

### ప్రభుత్వం కూలుతుంది: మోతీలాల్‌నాయక్

నిరుద్యోగుల దయాదాక్షిణ్యాలతో అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం.. తిరిగి అదే నిరుద్యోగుల ఆగ్రహంతో కూలిపోతుందని నిరుద్యోగ జేఏసీ నేత మోతీలాల్‌నాయక్ జోస్యం చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులను నట్టేట ముంచిందని, తాను తొమ్మిది రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసినా ఈ సర్కారు కనీసం పట్టించుకోలేదని మండిపడ్డారు. నిరుద్యోగ యువత ఆశలను అడియాశలు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం మాకొద్దని తేల్చిచెప్పారు. టీజీపీఎస్సీ ముట్టడికి వచ్చిన ఆయననూ పోలీసులు అరెస్టు చేశారు. ప్రభుత్వం దిగిరావాలని, లేకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

### రాహుల్‌ను నిలదీయాలని నిరుద్యోగుల యోచన

గత ఎన్నికల ముందు రెండు లక్షల ఉద్యోగాల భర్తీ కోసం జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, ఇప్పుడా హామీలను నెరవేర్చడానికి రాహుల్‌గాంధీ రావాలని నిరుద్యోగులు డిమాండ్ చేశారు. లేకపోతే న్యూఢిల్లీలో రాహుల్‌గాంధీని నిలదీయడానికి చలో న్యూఢిల్లీ కార్యక్రమం చేపడతామని, రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని పాతాళలోకంలో పడేస్తామని హెచ్చరించారు. 'హలో నిరుద్యోగి.. చలో న్యూఢిల్లీ' ముట్టడి కార్యక్రమానికి త్వరలో శ్రీకారం చుడుతామని ప్రకటించారు.



# ఉద్యోగం రాలేదని ఆత్మహత్య

**వరంగల్ జిల్లా అమినాబాద్‌లో విషాదం**

చెన్నారావుపేట, జూలై 5: ఉద్యోగం వస్తుందని తల్లిదండ్రులు తనపై పెట్టుకున్న ఆశలు నెరవేరలేదని మనస్తాపంతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం అమినాబాద్ గ్రామంలో చీర కళావతి–మల్లేశం దంపతులది వ్యవసాయ కుటుంబం. వారి కుమారుడు రంజిత్(25) బీఎస్సీ అగ్రికల్చర్ పూర్తి చేసి పోటీ పరీక్షలు రాస్తూ హైదరాబాద్‌లో ఉంటున్నాడు. ఇటీవల పలు పోటీ పరీక్షలు రాసినా ఎలాంటి ఫలితం లేక తనలో తానే కుంగిపోయాడు. అందరితో కలిసుంటే బాధను మరిచిపోతావని కడపలో స్నేహితుడి అక్క పెండ్లికి మిత్రులు తీసుకెళ్లారు. అయినా మానసిక ఒత్తిడితో ఉన్న రంజిత్ కడపలో తాను బస చేసిన హోటల్ గదిలో గురువారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉద్యోగం రాక తల్లిదండ్రుల ఆశలు నెరవేర్చలేక పోతున్నానని సూసైడ్ నోట్ రాసినట్టు అక్కడి పోలీసులు తెలిపారు. విషయం తెలిసి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. రంజిత్ మృతదేహం శుక్రవారం రాత్రికి స్వగ్రామం చేరుకుంటుందని, శనివారం అంత్యక్రియలు నిర్వహిస్తారని గ్రామస్థులు తెలిపారు.

## అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

**మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి**



బడంగ్‌పేట, జులై5: అక్రమ అరెస్టులతో నిరుద్యోగుల ఉద్యమాన్ని ఆపలేరని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి చెప్పారు. రెండు లక్షల ఉద్యోగాలిస్తామని హామీ ఇచ్చి ఎందుకివ్వలేదో నిరుద్యోగులకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దొంగ హామీలిచ్చి నిరుద్యోగులను ఎందుకు మోసం చేశారని ప్రశ్నించారు. ఏడు నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు ఒక్క నోటిఫికేషన్ వేయలేదని, నిరుద్యోగుల గోసను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. నిరుద్యోగులకు మద్ద తు తెలిపేందుకు వెల్తున్న బీఆర్ఎస్ యువజన నేతలు, విద్యార్థులను అరెస్టు చేయడం సిగ్గుమాలిన చర్య అని పేర్కొన్నారు.

## ప్రభుత్వ వైఖరిని ఖండిస్తున్నాం

**పీడీఎస్‌యూ, పీవైఎల్**

హైదరాబాద్, జూలై 5(నమస్తే తెలంగాణ): సమస్యల పరిష్కారం కోసం టీజీపీఎస్సీ ముట్టడికి యత్నించిన నిరుద్యోగులపై పోలీసుల నిర్బంధాన్ని పీడీఎస్‌యూ, పీవైఎల్ ఖండించాయి. నిరుద్యోగులపై ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్, ప్రధాన కార్యదర్శి ఎస్వీ శ్రీకాంత్, పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు ఇందూరి సాగర్, ప్రధాన కార్యదర్శి కోలా లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో పేరొన్నారు.

# తెలంగాణ బిడ్డలపై నిర్బంధం

మొదటిపేజీ తరువాయి...

గల్లీ నుంచి ఢిల్లీ దాకా పోరాటం ఉధృతం చేస్తామని నిరుద్యోగులు తేల్చిచెప్పారు.

### రాష్ట్రమంతటా అరెస్టులు

గ్రూప్–1 మెయిన్స్‌కు 1:100 పద్ధతిలో ఎంపిక చేయాలని, గ్రూప్–2, 3 పోస్టులు పెంచాలని, ప్రిపరేషన్‌కు వీలుగా పరీక్షలు వాయిదా వేయాలని వేలాది మంది నిరుద్యోగులు శుక్రవారం టీజీపీఎస్సీ కార్యాలయాన్ని ముట్టడించారు. రాష్ట్ర నలుమూలల నుంచి తరలివచ్చిన అభ్యర్థులు పెద్దపెట్టున నినాదాలు చేశారు. అయితే వీరిపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. హైదరాబాద్‌కు రాకుండా జిల్లాల్లో ఎక్కడికక్కడ నిరుద్యోగులను పోలీసులు అడ్డుకున్నారు. ముందస్తు అరెస్టులు చేశారు. హైదరాబాద్‌లోనూ పోలీసులు హల్‌చల్ చేశారు. టీజీపీఎస్సీ కార్యాలయం ముందు పలు వరుసల్లో బారికేడ్లు ఏర్పాటు చేశారు. వందలాది మంది పోలీసులు మోహరించారు. సచివాలయం, సీఎం నివాసం, ఇతర ప్రధాన భవనాలు, కూడళ్లలో బందోబస్తు నిర్వహించారు. టీజీపీఎస్సీకి వచ్చే అన్ని మార్గాలను తమ అదుపులోకి తీసుకున్నారు. రోడ్లతోపాటు మెట్రో స్టేషన్లపైనా నిఘాపెట్టారు. 18–40 ఏండ్ల మధ్య వయస్కుల్లో అనుమానం వచ్చిన ప్రతి ఒక్కరినీ ప్రశ్నించారు. అనుమానస్పదంగా కనిపించిన వారిని అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో వివిధ రంగాలకు చెందిన ప్రైవేట్ ఉద్యోగులు, మహిళలు, కాలేజీల విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. స్టూడెంట్స్ అని చెప్పి, కాలేజీ ఐడీ కార్డులు చూపించినా పోలీసులు కనికరించలేదు. అరెస్టు చేసి, స్టేషన్లకు పంపారు. అసెంబ్లీ నుంచి నాంపల్లి వైపు నడుచుకుంటూ వెళ్తున్న వారందరినీ అడ్డగించి, వివరాలు తెలుసుకొని, అరెస్టు చేసేందుకు విశ్వప్రయత్నం చేశారు. శుక్రవారంనాంపల్లి వైపు రావడమే పాపమన్నట్టు పోలీసులు వ్యవహరించారు.

### పోస్టులు పెంచేది లేదు..

నిరుద్యోగుల గర్జనతో రాష్ట్ర ప్రభుత్వం దిగివచ్చింది. సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం సాయంత్రం ఈ అంశంపై సుమారు 3 గంటల పాటు సమీక్షించారు. నిరుద్యోగుల డిమాండ్లు, వాటి పరిష్కారంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. చివరికి నిరుద్యోగుల డిమాండ్లలో గ్రూప్స్ లేదా డీఎస్సీ వాయిదా అంశాన్ని మాత్రమే పరిశీలిస్తామని చెప్పారు. మిగతావన్నీ పక్కన పెట్టేశారు. గ్రూప్–1 మెయిన్స్‌కు 1:100 ఎంపిక చేసినా, గ్రూప్–2, 3 పోస్టులు పెంచినా న్యాయపరమైన ఇబ్బందులు వస్తాయంటూ కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేశారు. ఈ ప్రకటనపై నిరుద్యోగులు మండిపడుతున్నారు. కోర్టు పేరు చెప్పి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ డిమాండ్లు తీరేదాకా వెనక్కి తగ్గబోమని స్పష్టంచేశారు.

### ఆంక్షల గోడలు బద్ధలు కొట్టి..

పోలీసులు అష్టదిగ్బంధనం చేసినా నిరుద్యోగులు వెనక్కి తగ్గలేదు. ఆంక్షల అడ్డుగోడలను బద్ధలుకొడుతూ, పోలీసుల కండ్లుగప్పి వేలాది మంది టీజీపీఎస్సీ కార్యాలయాన్ని ముట్టడించారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సీఎం డౌన్ డౌన్ అంటూ దిక్కులు పిక్కటిల్లేలా నినాదాలు చేశారు. దీంతో పోలీసులు వచ్చిన వారిని వచ్చినట్టే వ్యాన్లలోకి బలవంతంగా కుక్కి వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ క్రమంలో నిరుద్యోగులపై పోలీసులు జులుం ప్రదర్శించారు. తోపులాటలో పలువురు నిరుద్యోగులకు గాయాలయ్యాయి. కాళ్లు పట్టుకొని వేడుకున్నా, కన్నీళ్లు పెట్టుకున్నా కనికరం చూపలేదు. అనేకమందిని గోషామహల్ స్టేడియానికి తరలించగా స్టేడియంలోనూ వారి నిరసన కొనసాగింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, పాటలు పాడుతూ తమ నిరసనను కొనసాగించారు. మరోవైపు.. రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల్లోనూ నిరుద్యోగుల నిరసనలు మిన్నంటాయి. తమ ఉద్యమాన్ని ప్రభుత్వం అణగదొక్కడంపై రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల హామీని నెరవేరుస్తారా? లేదా? అంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌నే నిలదీస్తామని చెప్పారు. న్యాయపర మార్గాలనూ అన్వేషిస్తామన్నారు.

### బీఆర్ఎస్వీ సంపూర్ణ మద్దతు

నిరుద్యోగుల ఉద్యమానికి బీఆర్ఎస్ విద్యార్థి విభాగం సంపూర్ణ మద్దతు పలికింది. నేతలు గెల్లు శ్రీనివాస్, రాజారామ్ యాదవ్‌తోపాటు కార్యకర్తలు టీజీపీఎస్సీని ముట్టడించారు.వారిని పోలీసులు అరెస్ట్ చేశారు. గోషామహల్ స్టేడియంలో నిర్బంధించిన నిరుద్యోగులకు బీఆర్ఎస్ నేతలు ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులు సంఘీభావం తెలిపారు. వారిని వదిలిపెట్టాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుతున్నదంటూ మండిపడ్డారు. నిరుద్యోగుల డిమాండ్లు నెరవేరేదాకా మద్దతుగా ఉంటామని స్పష్టం చేశారు.

## నోటిఫికేషన్లు మార్చితే రద్దయ్యే ప్రమాదం

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, జూలై 5 (నమస్తే తెలంగాణ) : కొన్ని రాజకీయ పార్టీలు, స్వార్థపూరిత శక్తుల కుట్రలకు నిరుద్యోగులు బలికావొద్దని, నిబంధనలకు విరుద్ధంగా నిర్ణయాలు తీసుకుంటే నోటిఫికేషన్లు రద్దయి ఉద్యోగాల భర్తీ నిలిచిపోయి నిరుద్యోగులు మరింత నష్టపోతారని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఉద్యోగాల భర్తీ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్నదని, నిరుద్యోగులకు మేలు జరిగేలా నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. నిరుద్యోగుల ఆందోళనల దృష్ట్యా శుక్రవారం సాయంత్రం తన నివాసంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం ప్రకటన విడుదల చేశారు. పరీక్షల సమయంలో ఇష్టమొచ్చినట్టు నిబంధనలు మార్చడం వల్ల తలెత్తే చట్టపరమైన అంశాలను పరిగణనలోకి తీసుకొని ప్రభుత్వం తగు నిర్ణయం తీసుకుంటుందని వివరించారు. జాబ్ క్యాలెండర్ ప్రకారం పోటీ పరీక్షలు నిర్వహించి, ఉద్యోగాల భర్తీకి ప్రయత్నిస్తున్నామని పేర్కొన్నారు. శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో చర్చించి జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని, కేంద్ర ప్రభుత్వ నియామక పరీక్షలు, వివిధ బోర్డులు నిర్వహించే పరీక్షలతో ఆటంకాలు కలగకుండా అభ్యర్థులకు పూర్తి న్యాయం జరిగేలా క్యాలెండర్ రూపొందిస్తామనని వివరించారు. సమావేశంలో భాగంగా నిరుద్యోగుల ప్రధాన డిమాండ్లు, పరిష్కారంలో ఇబ్బందులపై అధికారులు వివరణ ఇచ్చారు. గ్రూప్–1 మెయిన్స్‌కు 1: 100 చొప్పున ఎంపిక చేస్తే కోర్టులు జోక్యం చేసుకునే ప్రమాదమున్నదని పేర్కొన్నారు. గ్రూప్–2, 3 పోస్టులు పెంచితే నోటిఫికేషన్‌ను ఉల్లంఘించినట్టే అవుతుందని, అప్పుడు కూడా కోర్టులు జోక్యం చేసుకునే అవకాశముందని చెప్పారు.

### వాయిదా డీఎస్సీనా? గ్రూప్–2నా?

నిరుద్యోగుల ఉద్యమ సెగ సర్కారుకు గట్టిగానే తగిలింది. దీంతో ఇన్నాళ్లూ బెట్టుచేసిన రేవంత్ సర్కారు ఓ అడుగు దిగివచ్చింది. డీఎస్సీ లేదా గ్రూప్–2 పరీక్షల్లో ఏదో ఒకటి వాయిదా వేసే దిశగా ముందుకుపోతున్నది. నిరుద్యోగుల ఆందోళన నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం అత్యవసర సమావేశం నిర్వహించారు. జూలై 18 నుంచి ఆగస్టు 5 వరకు డీఎస్సీ, ఆగస్టు 7, 8 తేదీల్లో గ్రూప్–2 పరీక్షలు నిర్వహించనున్న విషయం తెలిసిందే. ఇవి రెండూ ఒకదాని వెంటే మరొకటి నిర్వహిస్తుండడాన్ని అభ్యర్థులు వ్యతిరేకిస్తున్నారు. సమావేశంలోనూ సీఎం ఇదే అంశంపై చర్చించినట్టు తెలిసింది. పరీక్షల తేదీల విషయంలో టీజీపీఎస్సీ, విద్యాశాఖతో చర్చించిన తర్వాత నిర్ణయం తీసుకుంటామని సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఈ నేపథ్యంలో గ్రూప్–2 వాయిదా వేస్తారా? లేక డీఎస్సీనా? అనేది స్పష్టతనివ్వకపోవడంతో అభ్యర్థుల్లో టెన్షన్ నెలకొంది.

- నిజామాబాద్ జిల్లా ఏర్గట్ల స్టేషన్‌లో నిరుద్యోగుల నిరసన




- జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో ర్యాలీ




- సిరిసిల్ల పోలీస్‌స్టేషన్‌లో బీఆర్ఎస్వీ నేతలు



# ఎక్కడికక్కడ నిరుద్యోగుల కట్టడి

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, జూలై 5: టీజీపీఎస్సీ నిరుద్యోగ మార్చ్ నేపథ్యంలో పోలీసులు రాష్ట్రవ్యాప్తంగా ముందస్తు అరెస్టులు చేపట్టారు. నిరుద్యోగులు, బీఆర్ఎస్, యువజన, విద్యార్థి సంఘాల నేతలను ఎక్కడికక్కడ అదుపులోకి తీసుకున్నారు. శుక్రవారం తెల్లవారుజామునుంచే నాయకుల ఇండ్లలోకి వెళ్లి అరెస్ట్ చేశారు. నిరుద్యోగులు, బీఆర్ఎస్ నేతలతో పోలీస్‌స్టేషన్లు నిండిపోయాయి. అయినా నిరుద్యోగులు టీజీపీఎస్సీ ముట్టడికి పెద్ద ఎత్తున తరలివెళ్లారు. మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల్లో శుక్రవారం తెల్లవారుజాము నుంచే అరెస్ట్ చేశారు. నిజామాబాద్ జిల్లాలో 80 మందికి పైగా విద్యార్థి నేతలు, నిరుద్యోగులను స్టేషన్లకు తరలించారు. సూర్యాపేట, చివ్వెంల, నాగారం, తుంగతుర్తి, తిరుమలగిరి, మేళ్లచెరువు, మఠంపల్లి తదితర మండలాల్లో గురువారం సాయంత్రం నుంచే నిరుద్యోగులు, విద్యార్థి సంఘాల నాయకులకు ఫోన్లు చేసి స్టేషన్‌కు రావాలని హుకూం జారీ చేశారు. అర్ధరాత్రి దాటిన తరువాత ఇండ్లల్లోకి వెళ్లి స్టేషన్‌కు తీసుకువచ్చి బైండోవర్ చేశారు. నల్లగొండ జిల్లాలో కట్టంగూర్, శాలిగౌరారం, కొండమల్లేపల్లి మండలాల్లోనూ అరెస్టులు కొనసాగాయి. భద్రాద్రి జిల్లాలో 20 మందిని అదుపులోకి తీసుకున్నారు. ఉమ్మడి వరంగల్, కరీంనగర్, మహబూబ్‌నగర్, ఆదిలాబాద్ జిల్లాల్లోనూ అరెస్టు చేసి స్టేషన్లకు తరలించారు.



## ఇంట్లోనే సత్యాగ్రహ దీక్ష

**నిరుద్యోగులకు** ఉద్యోగాలు ఇవ్వాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించినందుకు పెద్దపల్లి బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉషను పోలీసులు హౌస్ అరెస్ట్ చేయడంతో ఆమె శాంతినగర్‌లోని తన నివాసంలో సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ తర్వాత మరిచిందని విమర్శించారు. మోసపూరిత మాటలను నమ్మి కాంగ్రెస్‌కు ఓటేసిన వారే ఇప్పుడు ఆగ్రహానికి గురవుతున్నారని, వారు మర్లబడితే కుర్చీని వదిలేసి వెళ్లి పోవాల్సి వస్తుందని ఉష హెచ్చరించారు.